క్లుప్తంగా

డివైడర్ పనులు ప్రారంభం



అయిజ: పట్టణంలోని అయిజ– గద్వాల రోడ్డుపై డివైడర్ పనులను కమిషనర్ గోల్కొండ నర్సయ్య మంగళవారం ప్రారంభించారు. మొత్తం రూ. 2 కోట్ల నిధులు మంజూరయ్యాయని కమిషనర్ తెలిపారు. పాతబస్టాండ్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు డివైడర్‌తోపాటు సెంట్రల్ లైటింగ్, మొక్కలు పెంపకం పనుల చేపడుతునట్లు వివరించారు. త్వరగా పనులు పూర్తిచేస్తామని పేర్కొన్నారు.

కంది విత్తనాలు పంపిణీ



శాంతినగర్: వానాకాలం సీజన్‌కు ప్రభుత్వం ఉచితంగా కంది విత్తనాలు సరఫరా చేస్తోందని, అవసరమైన రైతులు పాసు పుస్తకాలు అందజేసి తీసుకెళ్లాలని ఏఓ రాధ తెలిపారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయం కార్యాలయంలో రైతులకు కందివిత్తనాలు పంపిణీ చేశారు. నాలుగు కేజీల ప్యాకెట్లు 250 అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రానికి చెందిన ప్రవీణ్ మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

ఉత్తమ కండక్టర్‌కు అవార్డు

గట్టు: గద్వాల డిపోలో కండక్టర్‌గా విధులను నిర్వహిస్తున్న మండల కేంద్రానికి చెందిన శ్యాంసుందర్‌జోషి ఉత్తమ కండక్టర్‌గా ఎంపికయ్యాడు. మంగళవారం హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఉత్తమ కండక్టర్‌గా అవార్డును అందుకోవడం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రశంసాపత్రాలు అందజేత



మానవపాడు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జూన్ 24 నుంచి జూలై 4 వరకు ఎస్‌జీఓ వాయిస్ 4 గరల్స్ సంస్థ ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఒక్కో తరగతి నుంచి నలుగురిని ఎంపిక చేసి 10 రోజుల పాటు నైపుణ్యం, ప్రాథమిక హక్కులు, యుక్త వయస్సులో వచ్చే మార్పులు, రుగ్మతలు, సమాజంపై అవగాహన కల్పించి సూచనలు, సలహాలు అందజేశారు. హాజరైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన



మల్దకల్: మండలంలోని మేకలసోంపల్లిలో ఎర్రతెగులు సోకిన పత్తి పంటల పొలాలను మంగళవారం పాలెం శాస్త్రవేత్తలు డాక్టర్ భరత్‌భూషణ్‌రావు, డాక్టర్ అర్చన, డాక్టర్ వైశాల్య వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పత్తి పంటను పరిశీలించారు. ఎర్రతెగులు నివారణకు తీసుకోవలసిన నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఏడీఏ సంగీతలక్ష్మి, ఏఓ రాజశేఖర్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

వానలు కురవాలని..



మానవపాడు: మండలంలోని నారాయణపురంలో వానలు కురవాలని మంగళవారం వరుణ దేవుని కోసం నాంచారమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

ప్లాస్టిక్ నిషేధం అమలయ్యేనా?

● కఠిన చర్యలకు అధికారులపై దృష్టి



మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు(ఫైల్)



గద్వాలలో పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

గద్వాల: మానవ జీవితంలో ప్లాస్టిక్ వినియోగం నిత్యకృత్యమైంది. ప్లాస్టిక్ వాడితే మానవవాళికి భవిష్యత్తులో ముప్పుతప్పదని తెలిసినా ప్రజలు పెడచెవిన పెడుతున్నారు. పర్యావరణవేత్తలు, ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. ఫలితంగా వీటి వినియోగం అంతకంతకూ పెరుగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణాల్లోని రహదారుల పక్కన, నివాస గృహాల సమీపంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. గతంలో 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌పై నిషేధం విధించారు. గతేడాది జూలై 1వ తేదీ నుంచి 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌పై నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రోజుకు 10 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో సుమారు 30 వేల నివాస గృహాలు, దుకాణాలు ఉన్నాయి. 80 టన్నుల చెత్త రోజుకు ఉత్పత్తి అవుతోంది. అందులో పది టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. గతంలోనే గద్వాల, అయిజ మున్సిపాలిటీలలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేశారు.

ముమ్మర తనిఖీలు..

ప్లాస్టిక్ నిషేధానికి అధికారులు నడుంబిగించారు. కొన్ని రోజులుగా ఆయా మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. జిల్లా కేంద్రమైన గద్వాలలో ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాలతో నిత్యం ఉదయం, సాయంత్రం దుకాణాలపై దాడులు చేసి చర్యలు తీసుకుంటున్నారు. కూరగాయల మార్కెట్‌తో పాటు హోల్‌సేల్, రిటేల్ దుకాణాలతో పాటు దుకాణాలలో ప్లాస్టిక్ గ్లాసులు, వస్తువులను, కవర్లను స్వాధీనం చేసుకుంటున్నారు. ఒక్కో దుకాణానికి రూ. 25 వేల జరిమానా విధించి వసూళ్లు చేశారు. హోల్‌సెల్, రిటేల్ దుకాణాలలో లభించిన వారికి రూ. 2 వేల నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధించారు. దాడులు నిరంతరం కొనసాగుతాయిని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ప్రజల్లో మార్పు రావాలి

ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. పాలిథీన్ కవర్లకు బదులు ఇతర సంచులు వాడాలి. ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే వంద శాతం నిర్మూలన సాధ్యం. ప్లాస్టిక్ విక్రయాలు చేస్తే జరిమానాలతో పాటు దుకాణం లైసెన్సు రద్దు చేస్తాం.

– నర్సింహా, కమిషనర్, గద్వాల

మహిళ ఆరోగ్యం ఇంటికి సౌభాగ్యం



వివరాలు తెలుసుకుంటున్న స్రవంతి

మానవపాడు: మహిళ ఆరోగ్యం ఇంటికి సౌభాగ్యమని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. స్రవంతి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఆరోగ్యకేంద్రంలో చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్ద పోతులపాడు, గోలకుపాడు గ్రామాల పరిదిలోని గ్రామాల మహిళలకు ఆరోగ్య పరీక్షల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలకు ఆరోగ్యపరీక్షలను నిర్వహించామన్నారు. క్యాన్సర్, మూత్రనాళఇన్ఫెక్షన్, రక్తహీనత, బ్లడ్‌షుగర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 46 మందికి పరీక్షలు నిర్వహించగా, 30 మందికి రక్త పరీక్షలకోసం గద్వాల జిల్లా పంపించామన్నారు. కార్యక్రమంలో సత్యానారాయణ, చంద్రన్న, తిరుమల్‌రావు, సోని పాల్గొన్నారు.

సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలి

గద్వాల అర్బన్: పాత పెన్షన్ విధానం సాధన కోసం ఈనెల 16 నుంచి 31వ తేదీ వరకు చేపట్టిన సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని సీపీఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 1,72,000 మంది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల కంట్రిబ్యూషన్లను నిలిపివేయాలన్నారు. 16న జిల్లాలోని అలంపూర్ పుణ్య క్షేత్రం నుంచి మొదలవుతుందన్నారు. జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షుడు విష్ణు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి రమేష్ కుమార్, బుచ్చన్న, ప్రతాప్ రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

స్వామి వివేకానంద సేవలు స్ఫూర్తిదాయకం



ఉండవెల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఉండవెల్లి: స్వామి వివేకానంద సేవలు స్ఫూర్తిదాయకమని ఎంపీటీసీ సుంకన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్వామి వివేకానంద 121 వర్ధంతిని ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సంఘం సభ్యులు మాట్లాడుతూ యువతకు స్ఫూర్తి ప్రదాత, దేశ ప్రతిష్ఠను విశ్వవ్యాప్తం చేసిన చైతన్య మూర్తి వివేకానందుడని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సొంటి శ్రీనివాసులు, రైతు సంఘం సభ్యులు శ్రీరాములు, గొల్ల శ్రీరాములు, శేఖర్ రెడ్డి, రమేష్, సంఘం సభ్యులు కృష్ణ, నర్సప్ప, ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి



నగదు బహుమతులను అందజేస్తున్న అధికారులు

గద్వాల: విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలని ఆర్‌బీఐ అధికారి విజ్ఞారెడ్డి సూచించారు. ఆర్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో గతవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై జిల్లా స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డిజిటల్ లావాదేవీలు ఎంతగా జరుగుతున్నా కరెన్సీకి ప్రాధాన్యం తగ్గడం లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్‌బీఐ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించడానికి చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శరత్‌చంద్ర, మదన్‌లు మొదటి స్థానంలో నిలిచారు. వీరిని ఈ నెల 10న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక చేశారు. ఆర్‌బీఐ అధికారి అయ్యప్పరెడ్డి, ఎంఈఓ సురేష్, హెచ్‌ఎం జహురుద్దీన్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

అయిజ: పట్టణంలోని అన్ని కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో మున్సిపల్ సిబ్బంది, ఏఈ గోపాల్‌తో కలిసి మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడారు. పట్టణంలో పారిశుద్ధ్యం లోపించిందని విధులపై నిర్లక్ష్యం వహించిన కార్మికులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పట్టణంలోని 9వ వార్డును మున్సిపల్ చైర్మన్ సందర్శించారు. పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయని, పెద్ద వాహనాలు దారిమళ్లించిన మార్గంలోనే వెళ్లాలని, ఆటోలు, మోటార్ సైకిళ్లు అంబేడ్కర్ చౌక్ రోడ్డు మార్గంలో వెళ్లి సహకరించాలని కోరారు.

నేడు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు

మల్దకల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక కోసం ఇన్‌చార్జ్ ఎంఈఓ కొండారెడ్డి ఆధ్వర్యంలో 4,5 తరగతి చదువుతున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మల్దకల్‌లోని మిక్కీమౌస్ స్కూల్‌కు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 15 మంది విద్యార్థులు వివిధ క్రీడా పోటీలలో తమ ప్రతిభ కనబరిచినట్లు ఎంఈఓ తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించే క్రీడ పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఇమానియేల్, పీడీ సుహాసిని, పీఈటీలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్లో క్రీడా పాఠశాలలకు విద్యార్థులను ఈ నెల 5న ఎంపిక చేస్తున్నట్లు ఎంఈఓ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అలంపూర్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో పీడీ నగేష్ బాబు, పీఈటీ, హెచ్‌ఎంలతో ఎంఈఓ అశోక్ కుమార్ సమావేశం అయ్యారు. న్యూప్లాట్స్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈ నెల 5వ తేదీ ఉదయం 9 గంటలకు స్పోర్ట్స్ ప్రవేశాల కోసం 4, 5 వ తరగతి విద్యార్థులకు ఎంపిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు రాజు, నాగరాజు, స్థానిక హెచ్‌ఎం సువిజ్ఞానం తదితరులు ఉన్నారు.

ధరూరు: 2023–24విద్యా సంవత్సరానికి గాను మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే 4వ, 5వ తరగతి విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం ఈ నెల 5న ఉదయం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెలక్షన్స్ నిర్వహిస్తునట్లు ఎంఈఓ సురేష్ తెలిపారు.

కేటీదొడ్డి: మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు బుధవారం మండలంలోని నందిన్నె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు క్రీడా సెలక్షన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ తెలిపారు. 4వ, 5వ తరగతి విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

మరియమ్మకు ప్రత్యేక పూజలు



రాజోళి: మండలంలోని రాజోళి కోట వీధిలో వెలిసిన మరియమ్మ అమ్మవారికి సకులసాలి కులస్తుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా ప్రతి ఏడాది పూజలు నిర్వహించడం ఆనవాయితీ అని భక్తులు తెలిపారు. ఈ క్రమంలో అమ్మవారికి కుంకుమ అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు చేశారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలో నకిలీ ధ్రువపత్రాలతో పట్టాదారుడిని బెదిరించిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదైంది. ఎస్ఐ బాల్‌రాజు వివరాల ప్రకారం పుల్లూరు శివారులో 1.24 ఎకరాల పొలాన్ని 2019 సంవత్సరంలో మహమ్మద్ సలాం అనే వ్యక్తి నుంచి గ్రామానికి చెందిన కండవెల్లి రాజశేఖర్ కొనుగోలు చేశాడు. మహమ్మద్ సలాం మనుమడు మహబూబ్‌బాషా, మనుమరాలు రమీజాబీ నకలీ పత్రాలతో చూపించి భూమిని కొనుగోలు చేసిన రాజశేఖర్‌ను బెదిరింపులకు గురిచేస్తున్నారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

గద్వాల క్రైం: పోలీసుశాఖ అనుమతి లేకుండా మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించిన నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ రెండో ఎస్ఐ అబ్దుల్‌షుకుర్ తెలిపారు. బైక్‌లు, కార్లపై భారీ ఎత్తున ర్యాలీ చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగించారు. దీంతో ఆ సమితి అధ్యక్షుడు రంజిత్‌కుమార్, బుచ్చిబాబు, లవన్న, తిమ్మప్ప, గోవిందు, పేమరాజు, పరుశరాముడు, అమరేష్, సవరన్న, దయాకర్, రాముడులపై 30 యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురికి రిమాండ్

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కోదండాపురం పీఎస్ పరిధి/ లో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన ముగ్గురికి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటస్వామి మంగళవారం తెలిపారు. పట్టుబడిన వారిని అలంపూర్ కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒకరికి ఒకరోజు, ఇద్దరికి మూడు రోజులు పాటు జైలు శిక్ష విధించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

అలంపూర్: ఈ నెల 5వ తేదీన ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో పర్యటిస్తున్నట్లు క్యాంపు కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో భీమవరంలో, ఉట్కూరు, వడ్డేపల్లి మండలం బుడ్డమర్సు, జిల్లెడుదిన్నే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తారని తెలిపారు. ఇమాంపురం మసీద్ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

అయిజ: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కర్నాటక రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ మహాలక్ష్మీ, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు మాధన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు, ఓబీసీ జిల్లా మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు నరసింహయ్య శెట్టి, ప్రధాన కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, భగత్‌రెడ్డి, జానకిరాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

కేటీదొడ్డి: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని హెచ్‌ఎం శ్రీరాములు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఉమిత్యాలతండాలో సీఆర్‌పీలతో కలిసి బడిఈడు పిల్లలను బడిల్లో చేర్పించాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలనే వివరించారు.

సమ్మె నోటీసు అందజేత



శాంతినగర్‌లో ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

శాంతినగర్: గ్రామ పంచాయతీ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓకు అందజేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ఈ నెల 6వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు మధు, కార్తీక్, ప్రకాశం, రాజు, మల్లేష్, తిమ్మప్ప, గోవిందు, సవరన్న, సుంకన్నలు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ రమణారావుకు మంగళవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి జమ్మిచేడు కార్తిక్, సంజన్న, దస్తగిరి, మధుకుమార్, తిమ్మప్ప, బీసన్న, ఐలమ్మ, బీసమ్మ, ఎల్లప్ప ఏవమ్మా, చిన్నగోకారి, రాముడు, మునెమ్మ, ఈదన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, ఎంపీఓ పద్మావతికి పంచాయతీ కార్మికులు సమ్మె నోటీస్ అందజేశారు. మంగళవారం ఈ నెల 6వ తేదీ నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలోజమ్మిచేడు కార్తీక్, పరుశరాముడు, మద్దిలేటి, సత్యం, చిన్న మద్దిలేటి, సుదాకర్, మాయావతి, హేమలత, బిక్షపతి, కార్మికులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ అధికారికి సమ్మె నోటీస్‌ను అందజేశారు. నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని నాయకులు కార్మికులకు సూచించారు. కార్తీక్, వెంకట్రామిరెడ్డి, ఎర్రన్న, శివన్న, రాజు, పరుశ, పద్మమ్మ, బీసన్న, తదితరులు ఉన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



గద్వాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ వసంతలక్ష్మి

గద్వాల వ్యవసాయం: విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ వసంతలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆమె ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్‌లు, బిల్ పుస్తకాలు, ఇన్‌వాయిస్ రశీదులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదులు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. ఏఓ ప్రతాప్, ఇతర సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

గట్టు: ఎరువులు, విత్తనాలను దుకాణదారులు అధిక ధరలకు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి హెచ్చరించారు. మంగళవారం తప్పెట్లమొర్సు, గొర్లఖాన్‌దొడ్డి, గట్టు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఎరువులు, క్రిమి సంహారక మందులు, విత్తనాల స్టాక్‌లను పరిశీలించారు. తప్పని సరిగా స్టాకు నిల్వ, విక్రయాలకు సంబంధించిన వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

బీజేపీ పటిష్టతకు కృషి చేద్దాం



ఎక్లాస్‌పూర్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మల్దకల్: బీజేపీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలప్ప, గద్వాల అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. బీఆర్ఎస్ చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలోరాముడు, రాజశేఖర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మన్న, లోకన్న, రాజు, నాగరాజు, వెంకటేష్, రాజశేఖర్, గోపాల్ రెడ్డి, లవన్న, దర్మెల్లి, గోవిందు, నర్సింహా నాయక్, బుడ్డన్న, సందీప్‌రెడ్డి, రవి, సత్యారెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అయిజ: బీజేపీని బలోపేతం చేద్దాం ఆ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎక్లాస్‌పురం, ఈడుగోనిపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం కార్యక్రమం కొనసాగించారు. రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు, పంట నష్టం, పేదలకు ఇల్లు, కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేంద్ర, లక్ష్మణ్, తిరుమలేశ్, నర్సప్ప, ఉరుకుందు, తిమ్మప్ప, శివన్న, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం



చాగదోనలో మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంపీపీ, ఎంఈఓ

గట్టు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీపీ విజయ్‌కుమార్ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం చాగదోన ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ విజయ్‌కుమార్, ఎంఈఓ కొండారెడ్డిలు ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. జవహర్ నవోదయకు ఎంపికైన విద్యార్థి కిరణ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో మిట్టదొడ్డి ఎంపీపీ నర్సింహులు, గ్రామస్తులు నాగరాజు, సుబాన్, పంచాయతీ కార్యదర్శి రవీందర్‌గౌడ్, జయరాంగౌడ్, గుడిసె నర్సింహులు, కుమ్మరి శేషన్న తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ అశోక్ కుమార్ అన్నారు. సూచించారు. అలంపూర్ మున్సిపాలిటీలోని న్యూప్లాట్స్ పీఎస్ పాఠశాలను ఎంఈఓ అశోక్ కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ఉచిత యునిఫామ్స్‌ను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సువిజ్ఞానం, ఉపాధ్యాయులు సునిత, స్వరాజ్ బాబు ఉన్నారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదింపుదాం



మాట్లాడుతున్న పృథ్వీరాజ్

గద్వాల అర్బన్: రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదింపుదామని క్రాంతి దళ్ రాష్ట్ర అధ్యక్షుడు సంఘం రెడ్డి పృథ్వీరాజ్ పిలుపునిచ్చారు. గత నెలలో ఓ భూ తగదా విషయంలో జరిగిన ఘర్షణలో అమాయక రైతులపై కేసులు పెట్టి అరెస్టు చేసిన విషయం విధితమే. మంగళవారం జైలు విడుదలైన రైతులకు నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నడిగడ్డలో కుల ఆధిపత్య పెత్తందారుల ఆరాచకాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు. ఆ సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ అక్రమ కేసులు, అరెస్టులతో పోరాటాలను ఆపలేరన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిబాబు, లవన్న, తిమ్మప్ప, గోవిందు, ప్రేమ్ రాజు, సవారన్న, అమరేష్, దయాకర్, రాముడు తదితరులు ఉన్నారు.